క్లుప్తంగా

ఎంపీపీ నిధులతో డ్రెయినేజీల నిర్మాణం



కిలేశపురం(ఇబ్రహీంపట్నం): కిలేశపురం గ్రామంలో ఎంపీపీ నిధులు రూ.15 లక్షల వ్యయంతో డ్రెయినేజీల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. స్థానిక గంగానమ్మ ఆలయం నుంచి జగనన్న కాలనీ వరకు, ఎస్టీ ఏరియాలోని వాటర్ ట్యాంక్ ఎదురు రోడ్డులో డ్రెయినేజీలు, కల్వర్టు పనులు జరుగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో డ్రెయినేజీ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. వైస్ ఎంపీపీ బాణావత్ నాగబాలమ్మ కోరిక మేరకు ఎంపీపీ పాలడుగు జోత్స్న నిధులు మంజూరు చేయించారు. పనులు పారదర్శకంగా జరిగేలా పంచాయతీ కార్యదర్శి మునేశ్వరరావు పర్యవేక్షించారు.

గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలని ఆందోళన



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కేంద్రప్రభుత్వం పెంచిన గ్యాస్ లిండర్ ధర పేద, మధ్యతరగతి వర్గాలకు గుదిబండగా మారిందని ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులు కే బేబీ సరోజిని, ఎల్.పార్వతి పేర్కొన్నారు. కొండపల్లి శాంతినగర్‌లో సోమవారం ఆందోళన నిర్వహించి, గ్యాస్ బండలు ప్రదర్శించారు. కట్టెల పొయ్యిపై వంటలు చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ గ్యాస్ ధరల పెంపుతో కట్టెల పొయ్యి వచ్చే పరిస్థితి వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పేదల నడ్డివిరిచి, సంపన్నులకు మేలు చేస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.

ఇంటర్ పరీక్షలకు 82 మంది గైర్హాజరు



నూజివీడు: ఇంటర్ ప్రథమ సంవత్సరం బోటనీ, గణితం-1ఏ, సివిక్స్ పరీక్షకు సోమవారం 82 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలోని మదుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల, శ్రీ శారద జూనియర్ కళాశాల, శ్రీ వాగ్దేవి జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ నాలుగు కేంద్రాలలో కలిపి 1,723 మంది విద్యార్థులకు 1,641 మంది హాజరు కాగా 82 మంది గైర్హాజరయ్యారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

దంతాల ఆరోగ్యంపై అవగాహన అవసరం



నూజివీడు: నోరు, దంతాల ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్ అన్నారు. ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఏరియా ఆస్పత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రింక్స్, షుగర్ పదార్థాలు, చక్కెర పానియాలు, చాక్లెట్, గుట్కాలు తదితర పదార్థాలు పళ్లకు హాని చేస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ రోజుకు రెండు సార్లు బ్రష్ చేసుకోవాలన్నారు. దంత వైద్యులు సీహెచ్ దినేష్ పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన



నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని కార్యాలయ ఏఓ వై.రంగారావు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. స్పందనలో 13 అర్జీలు రాగా వాటిని ఆయా సంబంధిత అధికారులకు పంపించారు.

రైతులకు భరోసా.. ఆర్బీకేలు

నియోజకవర్గంలో 92 రైతు భరోసా కేంద్రాల ద్వారా సేవలు



నూజివీడు మండలం తుక్కులూరులోని రైతు భరోసా కేంద్రం

నూజివీడు: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించాక రాష్ట్రంలో రైతాంగ పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టడమే కాకుండా అమలుచేసి చూపిస్తూ వ్యవసాయాన్ని పండగగా మార్చింది. రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయాన్ని సాగుకు ముందే అందజేస్తూ రైతుల్లో భరోసాను కల్పిస్తోంది. దీనికి తోడు గ్రామగ్రామాన రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వం వ్యవసాయ సేవలను రైతుల చెంతకు తీసుకువచ్చింది. దీంతో వ్యవసాయశాఖ ద్వారా క్షేత్రస్థాయిలో గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులకు ప్రభుత్వ సేవలు అందుతున్నాయి.

రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు

ప్రభుత్వానికి రైతులకు మధ్య దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వం అందజేస్తున్న సేవలన్నీ రైతుల చెంతకే వెళ్లేందుకు గాను గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎరువులు, విత్తనాలు, పచ్చిరొట్ట విత్తనాలు అందించడం, ధాన్యాన్ని కొనుగోలు చేయడం వంటివన్నీ ఈ రైతుభరోసా కేంద్రాల్లోనే నిర్వహిస్తున్నారు. రాబోయే రోజుల్లో రైతు భరోసా కేంద్రాలకు అనుసంధానంగా గోడౌన్‌లు, కోల్డ్‌స్టోరేజీలను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అంతేగాకుండా ప్రాథమిక స్థాయిలో ఫుడ్‌ప్రాసెసింగ్ సెంటర్లను ఏర్పాటు చేయడానికి కసరత్తు చేస్తోంది. నూజివీడు నియోజకవర్గంలో ప్రస్తుతం 92 రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు వ్యవసాయానికి సంబంధించిన సేవలను అందజేస్తోంది. వీటన్నింటికీ తోడు వందలాది మంది వ్యవసాయ సహాయకులను, ఉద్యాన సహాయకులను, సెరీకల్చర్ సహాయకులను, పశుసంవర్ధక సహాయకులను నియమించి రైతులకు అవసరమైన సేవలను అందిస్తోంది. వీరు పంటల సాగులో, తెగుళ్ల విషయంలో సకాలంలో సలహాలు, సూచనలు అందిస్తూ రైతులకు చేదోడు వాదోడుగా ఉంటున్నారు. దేశానికి అన్నంపెట్టే రైతన్నకు ఎంత చేసినా తక్కువేననే సానుకూల దృక్పథంతో ప్రభుత్వం వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. రైతు భరోసా కేంద్రాలు రైతులకు ప్రతి విషయంలోనూ చేదోడువాదోడుగా ఉంటూ ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నాయి.

రైతులకు ఎంతో మేలు



గతంలో ఎరువులు, విత్తనాలు కావాలంటే మండల కేంద్రానికి వెళ్లేవాళ్లం. ఇప్పుడు ఎక్కడకు వెళ్లాల్సిన అవసరం లేదు. గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలోనే విత్తనాలు, ఎరువులు, పచ్చిరొట్ట విత్తనాలు తదితరవన్నీ లభిస్తున్నాయి. రైతులకు అవసరమైన సేవలన్నీ రైతు భరోసా కేంద్రాల్లోనే లభిస్తున్నాయి.

– పల్నాటి రఘు, దేవరగుంట, నూజివీడు మండలం

వర్షానికి దెబ్బతిన్న పంటలు



తోలుకోడులో వర్షానికి దెబ్బతిన్న టమాటా తోట

తోలుకోడు(మైలవరం): మైలవరం మండలంలో రెండు రోజులు కురిసిన భారీ వర్షానికి మొక్కజొన్న, టమాటా పంటలు దెబ్బతిన్నాయి. మండలంలో మొక్కజొన్న పంట 250 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. మండలంలోని తోలుకోడులో గ్రామానికి చెందిన మాదు రత్తయ్య అనే రైతు తనకున్న మూడు ఎకరాల్లో టమాటా పంట వేశాడు. పంట చేతికి వచ్చే సమయానికి వర్షం దెబ్బకు టమాటా తోట పూర్తిగా దెబ్బతింది. ఇప్పటి వరకు తోటకు రూ.80వేలకు పైగా ఖర్చు అయిందని రైతు తెలిపారు. పంట చేతికి వచ్చే సమయానికి వర్షం రావడంతో పూర్తిగా దెబ్బతిందని, కాపు నేలరాలిపోయిందని రైతు వాపోయాడు. అధికారులు స్పందించి పంట నష్టంపై అంచనా వేసి తనకు న్యాయం చేయాలని రైతు కోరుతున్నాడు.

పంటల పరిశీలన



పొందుగలలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

పొందుగల(మైలవరం): మైలవరం మండలంలో వర్షానికి దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాఖ జిల్లా అధికారులు సోమవారం పరిశీలించారు. మండలంలోని వెల్వడం, పొందుగల గ్రామాల్లో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎం. విజయ భారతి స్థానిక అధికారులతో కలిసి వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్న పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ(ఆర్) ఎం. శ్రీనివాసరావు, ఏఓ కే సంధ్యారాణి, ల్యాబ్ ఏఈఓలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

నూజివీడు: షెకేము యునైటెడ్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక నూజివీడులో సోమవారం నిర్వహించారు. పట్టణంలోని మన్నా చర్చిలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రెవ.జీఆర్ సుశీలరావు, గౌరవాధ్యక్షుడిగా ఎస్.ఏసుపాదం, విఠల్‌బాబు, జనరల్ సెక్రటరిగా పీ మోషే, జాయింట్ సెక్రటరీలుగా జీ డేవిడ్, బీ రవికుమార్, ఉపాధ్యక్షులుగా దైవవరప్రసాద్, కే జయరాజు, టీ జీవరత్నం, కోశాధికారిగా కే సంసోను, సలహాదారులుగా జీవజలం, వరప్రసాద్, లీగల్ అడ్వయిజర్‌గా కేజే డిక్సన్, ఈసీ సభ్యులుగా జాషువా, సతీష్, సుగుణరావు, ఏసుపాదం, జాన్‌కెనడీ, షాలేము రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ



తిరువూరు కోర్టులో విధులను బహిష్కరించిన న్యాయవాదులు

తిరువూరు: పోలీసుల వైఖరిని నిరసిస్తూ తిరువూరు కోర్టు న్యాయవాదులు సోమవారం తమ విధులను బహిష్కరించారు. భవానిపురం హౌసింగ్ బోర్డ్ కాలనీలో నివాసం ఉంటున్న న్యాయవాది ఆత్మూరి వెంకట భగవాన్ కుమార్తెతో వినయ్ అనే వ్యక్తి ఆదివారం అసభ్యకరంగా ప్రవర్తించాడు. విషయం తెలుసుకున్న న్యాయవాది భగవాన్ దాస్ పాపను తీసుకుని రాత్రి 10 గంటలకు భవానిపురం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సంఘటనపై ఫిర్యాదు చేశారు. అర్ధరాత్రి వరకు భగవాన్ దాసును కూర్చోపెట్టిన పోలీసులు ఎటువంటి కేసు నమోదు చేయలేదు. పైగా వినయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు న్యాయవాదిపై అక్రమ కేసు బనాయించారని న్యాయవాదులు తెలిపారు. పోలీసుల వైఖరిని నిరసిస్తూ తిరువూరు కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. తిరువూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మర్సకట్ల కుమార్, కొత్తపల్లి ఆనందస్వరూప్, సీనియర్ న్యాయవాది ఎస్.జనార్దన్ రావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

భక్తి విశ్వాసమే విజయానికి నాంది

ముసునూరు: విశ్వాసమే విజయానికి, రక్షణకు నాంది, స్ఫూర్తి ఏలూరుకు చెందిన కర్మెల్ మినిస్ట్రీ అధినేత, ప్రముఖ సువార్త ప్రసంగీకుడు ఎబినేజర్ శాస్త్రి పేర్కొన్నారు. కాట్రేనిపాడు శివారు రాజీవ్ నగర్‌లో పాస్టర్ బి.ఏసుదాస్ ఆధ్వర్యంలో నిర్మితమైన కర్మెల్ మినిస్ట్రీ నూతన చర్చిని సోమవారం ఆయన పారంభించారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు పురుషోత్తమ్, రాజు ఆధ్వర్యంలో గౌరవాధ్యక్షుడు కంబాల రాంబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన క్రీస్తు సందేశాన్ని అందించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

మహిళలకు శిక్షణ అభినందనీయం

ముసునూరు: మారుమూల పల్లెల్లోని యువతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి వారిని అభివృద్ధి చేయడం అభినందనీయమని హోలీ ఫ్యామిలీ సిస్టర్స్ జాతీయాధ్యక్షురాలు జయ పేర్కొన్నారు. మండలంలోని రమణక్కపేట హోలీ ఫ్యామిలీ సిస్టర్స్ సుపీరియర్ మేరీ మెటిల్డా ఆధ్వర్యంలో ట్రైనింగ్ ఇన్‌చార్జ్ సిస్టర్ మేరి అధ్యక్షతన ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు నెలలు శిక్షణ ముగించుకున్న 15 మంది యువతులకు డిప్లొమా సర్టిఫికెట్లతో పాటు కుట్టుమిషన్లను అందజేశారు.

మృతుడి కుటుంబ సభ్యులకు సాయం

ముసునూరు: అనారోగ్యం, ప్రమాదాల బారినపడి సొసైటీ సభ్యులు మృతి చెందితే తమ సహకార సంఘం ఆదుకుంటుందని చింతలవల్లి వ్యవసాయ సొసైటీ అధ్యక్షుడు నాగళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఇటీవల మృతి చెందిన సంఘ సభ్యుడు చెందిన కంచర్ల పద్దయ్య కుటుంబానికి సహకార సంఘం, కేడీసీసీ బ్యాంకు తరఫున రూ.10,000 అంతిమ సంస్కారాల కోసం తక్షణ సాయాన్ని సోమవారం అందజేశారు.

నరసింగపాలెంలో డ్రోన్ సర్వే

ఆగిరిపల్లి: డ్రోన్ సర్వేతో భూముల సరిహద్దుల నిర్ధారణ చేయనునట్లు తహసీల్దార్ ఎం.ఉదయభాస్కరరావు అన్నారు. మండలంలోని నరసింగపాలెంలో జగనన్న భూ సమగ్ర రీసర్వేలో భాగంగా సోమవారం డ్రోన్ సర్వే నిర్వహించారు.

భారీ వర్షం

చాట్రాయి: ద్రోణి ప్రభావంతో సోమవారం మండలంలో భారీ వర్షం కురిసింది. సాయంత్రం 4 గంటల పాటు భారీ వర్షం కురిసింది. దీంతో చాలా గ్రామాల్లో కల్లాల్లో ఉన్న మొక్క జొన్న పంట నీట మునిగింది.

ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ

విస్సన్నపేట: ప్రతిభా కళాశాలలో 2023-24 సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో చేరుటకు ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతున్నట్లు స్థానిక గిరిజన బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఝాన్సీలక్ష్మి సోమవారం తెలిపారు. ఆసక్తిగల విద్యార్థినులు ఏప్రిల్ 18వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తుల చేసుకోవాలని పేర్కొన్నారు.

నేటి నుంచి విద్యార్థులకు రాగి జావ పంపిణీ

గంపలగూడెం: విద్యార్థుల్లో రక్తహీనత నివారణ చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం మంగళవారం నుంచి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి బీ సోమశేఖర్‌నాయక్ తెలిపారు. దీనికి అవసరమైన బెల్లం, రాగి పిండిని ప్రభుత్వం సరఫరా చేసిందని పేర్కొన్నారు. పాఠశాలలో అసెంబ్లీకి ముందుగా విద్యార్థులకు జావ పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రతి విద్యార్థీ తప్పకుండా రోజూ జావ తీసుకోవాలని పేర్కొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఆర్‌టీఈ అడ్మిషన్లు

మైలవరం: ప్రైవేట్ పాఠశాలల్లో ఆర్‌టీఈ అడ్మిషన్ల సందర్భంగా ఒకటో తరగతిలో విద్యార్థుల అడ్మిషన్ కోసం పుట్టిన తేదీపై విద్యాశాఖ కమిషనర్ వివరణ జారీ చేసినట్లు మైలవరం మండల విద్యాశాఖ అధికారి పీ రత్నశ్యామ్‌బాబు సోమవారం తెలిపారు. ఐబీ, ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ సిలబస్ పాఠశాలల అడ్మిషన్‌కోసం 2023 ఏప్రిల్ ఒకటో తేదీ నాటికి ఐదు సంవత్సరాలు పూర్తి అయి ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్ర సిలబస్ పాఠశాలల్లో అడ్మిషన్ కోసం 2023 జూన్ ఒకటో తేదీ నాటికి ఐదు సంవత్సరాలు వయసు పూర్తయి ఉండాలని తెలిపారు. ఇతర వివరాలకు మండల విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఎంఈఓ పేర్కొన్నారు.

రేపు నూజివీడులో కవి సమ్మేళనం

నూజివీడు: ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం పట్టణంలోని శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ఆవరణలో అభ్యుదయ రచయితల సంఘం, ప్రజానాట్యమండలి, నూజివీడు కళావేదికల ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముఖ్య అతిథిగా అరసం రాష్ట్ర కార్యదర్శి నాగార్జునసాగర్ పాల్గొంటారన్నారు. సాయంత్రం ఐదు నుంచి రాత్రి 9.30 గంటల వరకూ నిర్వహించే కవి సమ్మేళనంలో పంచాంగంతో పాటు జానపద, కూచిపూడి నృత్యాలు, లఘు నాటికలు, ఏకపాత్రాభినయం, శ్లోక పఠనం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

జెండా పైపును దొంగిలించారని ఫిర్యాదు

మైలవరం: మైలవరంలోని ప్రధాన కూడలి పంచాయతీ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన బీజేపీ జెండా పైపును గుర్తు తెలియని వ్యక్తులు విరగగొట్టి దొంగిలించినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు పీ వెంకటేశ్వరరావుకు సోమవారం ఫిర్యాదు చేశారు. కొద్దిసేపు నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఎస్సై రాంబాబు సంఘటన స్థలం వద్దకు చేరుకుని జెండా దిమ్మను పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కాజా కిరణ్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'లో రెండు అర్జీలు

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో రెండు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. తహసీల్దార్ జి. బాలకృష్ణారెడ్డి, ఎంఈఓ సోమశేఖర్‌నాయక్, ఏఓ సాయిశ్రీ, గృహ నిర్మాణశాఖ ఏఈ కిషోర్, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం నాగరాజు పాల్గొన్నారు.

మాదిగలను మోసం చేసినందుకు నిరసన



పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రెడ్డిగూడెం: ఎస్సీ వర్గీకరణపై బీజేపీ చేసిన మోసాన్ని నిరసిస్తూ రెడ్డిగూడెం మండలం శ్రీరామపురం, మద్దులపర్వ, కూనరాజుపర్వ వరకు పాదయాత్ర నిర్వహించినట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ ఎ.నాగమల్లేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 3, 4 తేదీలలో విజయవాడ బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంకొల్లు జమలయ్య, రెడ్డిగూడెం మండల ఎంఎస్పీ ఇన్‌చార్జి రామారావు, నాయకులు రమేష్, ప్రసాద్, గోపి, సురేష్ పాల్గొన్నారు.

బ్లడ్ క్యాన్సర్ బాధితుడికి రూ. లక్ష సాయం

సీఎం ఆదేశంతో చెక్ మంజూరు చేసిన కలెక్టర్



ఆర్థిక సాయం చెక్కును అందజేస్తున్న తహసీల్దార్, ప్రజా ప్రతినిధులు

తిరువూరు: బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఒక బాలుడికి వైద్యం కోసం రూ. లక్ష ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం కలెక్టర్ ఢిల్లీరావు సోమవారం విడుదల చేశారు. సంబంధిత చెక్కును తిరువూరు మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సురేష్ బాబు, ఏఎంసీ చైర్మన్ నాగ నర్సిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు వై.రామచంద్రారెడ్డి, ఎంపీపీ గద్దల భారతి బాధిత బాలుని తండ్రి మారేపోగు శ్రీనుకు అందజేశారు. విద్యాదీవెన నగదు విడుదల చేసేందుకు ఆదివారం తిరువూరులో నిర్వహించిన బహిరంగ సభకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మీటింగ్ సమయంలో తిరువూరు మండలం కొమ్మిరెడ్డిపల్లికి చెందిన మారేపోగు శ్రీను, వెంకట్రావమ్మ దంపతులు తమ కుమారుడు రంజిత్‌కుమార్ బ్లడ్‌క్యాన్సర్‌తో బాధపడుతున్నాడని తగిన సాయం చేసి ఆదుకోవాలని కోరారు. దీంతో ముఖ్యమంత్రి స్పందించి తక్షణమే రూ.లక్ష మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. మరుసటి రోజే సంబంధిత చెక్కును కలెక్టర్ మంజూరు చేయడంతో బాలుడి తండ్రికి చెక్ అందజేశారు. సర్పంచ్ బంకా వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు నామా గోపాల్, బంకా ప్రసాద్, మన్నే గోపాలరావు, ఉప సర్పంచ్ కృష్ణయ్య పాల్గొన్నారు.

'స్పందన'లో సమస్యల పరిష్కారం



స్పందన కార్యక్రమంలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

చాట్రాయి: స్పందన ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్నట్లు నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ఒక చెరువుని తీసుకుని సుందరీకరణ చేస్తామని చెప్పారు. గ్రామాల వారీగా సమస్యలపై వీఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, తహసీల్దార్ విశ్వనాథరావు, ఎంపీడీఓ ఎస్.మురళీమోహనరావు, వ్యవసాయ అధికారి శివ శంకర్, ఎంఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

ముమ్మరంగా సరిహద్దు రాళ్ల ఏర్పాటు



కనుమూరులో సరిహద్దు రాళ్లను పాతిస్తున్న తహసీల్దార్

గంపలగూడెం: జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకంలో భాగంగా భూ రీ సర్వే పూర్తయిన మండలంలోని ఆరు గ్రామాలలో రైతాంగం పొలాలను సరిహద్దు రాళ్లను (బౌండరీస్) ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని రెవెన్యూశాఖ ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి పర్యవేక్షణలో మండలంలోని కనుమూరు, అనుముల్లంక, వినగడప, గంపలగూడెం, చెన్నవరం, రాజవరం గ్రామాలలో అధికారులు భూ రీసర్వే పూర్తిగావించారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు భూములకు సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేసేందుకు 13 వేల రాళ్లు అవసరం ఉండగా ఇప్పటి వరకు 8,500 రాళ్లను ఉన్నతాధికారులు సరఫరా చేశారు. ఆయా గ్రామాల్లో ఆర్ఐ మోహన్, వీఆర్వోలు ప్రతాప్, ప్రభాకర్‌రెడ్డి, దుర్గారావు, ఎం.వెంకటేశ్వరరావు, ఇమ్రాన్‌పాషా, కే వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామ సచివాలయాల సర్వేయర్లు, రైతుల సమక్షంలో సరిహద్దు రాళ్లను పాతిస్తున్నారు. సరఫరా అయిన రాళ్లలో ఇప్పటికే 45 శాతం రాళ్లను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. మిగిలిన రాళ్లను కూడా సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేయాలని వీఆర్వోలను ఆదేశించామన్నారు.

ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వ సహకారం



మాట్లాడుతున్న నూర్‌బాషా

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): రాష్ట్రంలో ముస్లిం అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అభినందనీయమని రాష్ట్ర సయ్యదుత్ సాదత్ సంఘం ఆడహక్ కమిటీ కన్వీనర్ హజరత్ నూర్ బాబా అన్నారు. స్థానిక షాబూఖారీ దర్గా ఆవరణలో రాష్ట్ర సయ్యదూత్ సాదత్ కమిటీ సమావేశం సోమవారం జరిగింది. సమావేశంలో అడహక్ కమిటీ కన్వీనర్‌గా పెనుగొండ షరీఫ్ దర్గా పెద్దలు నూర్‌బాబాను ఎన్నుకున్నారు. రాష్ట్రంలో సుప్రసిద్ధ దర్గాల్లో ఉన్న హజరత్ వంశీకులు సయ్యాదులే అన్నారు. గత పాలకులు సయ్యాదులను విభజించి రిజర్వేషన్లు లేకుండా చేశారన్నారు. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల పీఠాధిపతులు సమావేశంలో సయ్యాదుల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడం హర్షణీయం అన్నారు. ముస్లిం సంక్షేమానికి పాటుపడుతున్న ప్రభుత్వానికి ముస్లింలు అండగా ఉంటారన్నారు. వివిధ ప్రాంతాల పీఠాధిపతులు హాజరయ్యారు.

పోషకాహార లోపం నివారణకే పోషణ్ పక్వాడా



పోషణ్ పక్వాడా ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతోన్న సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

నూజివీడు: గర్భిణులు, బాలింతలు, పిల్లల్లో పోషకాహార లోపం నివారణ కోసమే ప్రభుత్వం పోషణ పక్వాడా పక్షోత్సవాలు నిర్వహిస్తోందని సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పక్షోత్సవాలను సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సబ్ కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023వ సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా యునైటెడ్ నేషన్ జనరల్ అసెంబ్లీ ప్రకటించిన నేపథ్యంలో పోషణ పక్వాడా పక్షోత్సవాల్లో చిరుధాన్యాల వల్ల కలిగే లాభాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. సీడీపీఓ ఎస్వై నూరాని మాట్లాడుతూ నూజివీడు ప్రాజెక్టు పరిధిలోని గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పోషణ పక్వాడాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

అధ్యాపకురాలికి సన్మానం



అధ్యాపకురాలిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

జి.కొండూరు: మండల పరిధి చెవుటూరు శ్రీవాణి ఫార్మసీ కళాశాలలో ఫార్మసీ విభాగాధిపతిగా పని చేస్తున్న పాలగాని శ్వేత ఆంధ్ర యూనివర్సిటీ నుంచి ఇటీవల డాక్టరేట్ పొందారు. ఈ క్రమంలో కళాశాల చైర్మన్ కొల్లి వెంకటరవికుమార్, ప్రిన్సిపాల్ నరేంద్రకుమార్‌రెడ్డి డాక్టర్ శ్వేతను సోమవారం సన్మానించారు.